క్లుప్తంగా

పాఠశాల తనిఖీ



విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ

శిరివెళ్ల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం డిప్యూటీ డీఈఓ శంకరప్రసాదు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, టీచర్ల హాజరు పట్టికలను పరిశీలించారు. తల్లికి వందనంపై డిప్యూటీ డీఈఓ హెచ్ఎం గోవిందరాజులను ఆరా తీయగా పాఠశాలలో ఆధార్ సమస్యలతో ఇంకా వంద మంది విద్యార్థుకు నగదు జమ కాలేదన్నారు.అలాగే ఉర్దూ మీడియం సోషల్ టీచర్ పోస్టు ఖాళీగా ఉందని, సర్దు బాటు చేయాలని కోరారు. దీనిపై డిప్యూటీ డీఈఓ స్పందిస్తూ ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం వడ్డించాలని సూచించారు.

శ్రీకాళికాంబాదేవికి ప్రత్యేక పూజలు

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలోని గాంధీ చౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబాదేవికి శుక్రవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం చేశారు. తర్వాత వివిధ రకాల పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం కాళీమాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు, విజయకుమార్, నరసింహ, అంబరేష్, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రహ్మణ్యం శాస్త్రీ పాల్గొన్నారు.

9న దేశ వ్యాప్త సమ్మె



గోడపత్రికలను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ వచ్చేనెల 9న దేశ వ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. ఈ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు తోటమద్దు మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి కార్మికుల పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తూట్లు పొడవడం బాధాకరమన్నారు. పాలకులు కార్మికులను కట్టు బానిసల్లా చూస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం విధానాలకు నిరసనగా చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాలవెంకట్, మిట్నాల తిరుపతయ్య, నాయక్, నరసింహ, జైలాన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసమే 'శక్తియాప్'



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ

బొమ్మలసత్రం/నంద్యాల (న్యూటౌన్): ఆపదలో ఉన్న మహిళలు, బాలికల రక్షణ కోసమే శక్తియాప్‌ను రూపొందించినట్లు సీఐ జయరాములు తెలిపారు. ప్రతి ఒక్కరి మొబైల్‌ఫోన్‌లో ఈయాప్‌ను డౌన్‌లోడు చేసుకోవాలని సూచించారు. శుక్రవారం స్థానిక నలంద కళాశాలలో విద్యార్థినులకు శక్తియాప్ గురించి అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితిలో శక్తియాప్‌లో ఉన్న ఎస్‌వోఎస్ బటన్ నొక్కాలని సూచించారు. క్షణాల వ్యవధిలోనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆపద నుంచి ఆదుకుంటారని వివరించారు. కార్యక్రమంలో శక్తిటీమ్ బృందం, కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

సొంత మండలంలో నియమించాలి

నంద్యాల(న్యూటౌన్): 2008, 1998 డీఎస్సీ మినిమంటైం స్కేల్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులను వారి సొంత మండలాల్లో నియమించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగరి శ్రీనివాసులు, రాష్ట్ర సమితి సభ్యులు గోపాల్‌రావు కోరారు. శుక్రవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కనీస వేతనంతో పని చేస్తున్న టైం స్కేల్ ఉపాధ్యాయులను ఉత్తర్వులకు విరుద్ధంగా సుదూర ప్రాంతాల్లో నియమించడానికి విద్యాశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల బదిలీల తర్వాత మిగిలిన ఖాళీలను ఎంటీఎస్ ఉపాధ్యాయులు కోరుకోవడానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా అదనపు కార్యదర్శి పుల్లయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జయరాం, రవి పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుకు ఇదే అదును

- నల్ల రేగడి, ఎర్ర నేలలు అనుకూలం
- యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలైన దిగుబడులు
- పెరుగుతున్న సాగు విస్తీర్ణం

నంద్యాల(అర్బన్): మొక్కజొన్న ఆహార పంటగానే కాకుండా దాణా రూపంలో, పశువుల మేతగా, వివిధ పరిశ్రమల్లో ముడి సరుకుగా ఉపయోగిస్తారు. తక్కువ సమయంలో పంట చేతికి రావడం, మార్కెట్లో గిట్టుబాటు ధర లభిస్తుండటంతో సాగుకు కర్షకులు మొగ్గు చూపుతున్నారు. మొక్కజొన్న సాగుకు అనువైన సమయం ఇదేనని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు పంట సాగులో నిమగ్నమయ్యారు. నంద్యాల వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లోని ఈ ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 13,500 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు కానుంది. గత ఏడాది కంటే ఈ ఏడాది 8వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరగనుందని అధికారులు చెబుతున్నారు.

ఈ నేలలు అనుకూలం..

సారవంతమైన, నీరు ఇంకే నల్లరేగడి నేలలు, ఎర్ర నేలలు, ఒండ్రు కలిగిన ఇసుక నేలలు మొక్క జొన్న సాగుకు అనుకూలమైనవి. చౌడు భూములు, నీరు నిల్వ ఉండేవి ఈ పంటకు అనుకూలించవు. ఎకరాకు పది టన్నులు బాగా మగ్గిన పశువుల ఎరువును ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి.



మొక్కజొన్న పైరు

సాధారణ పరిస్థితుల్లో వర్షాధారపు పంటను జూన్ 15 నుంచి జూలై 15వ తేదీ వరకు విత్తుకోవచ్చు.

కలుపు నివారణ ఇలా..

విత్తిన తర్వాత రెండు రోజుల్లోపు అట్రాజెన్ కలుపు మందును నేల రకాన్ని బట్టి 800–1200 గ్రాములు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. విత్తనం నాటిన 30 రోజుల తర్వాత 2-4-డి సోడియం సాల్ట్ 0.5 కిలోలు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. విత్తనం నాటిన 30 నుంచి 45 రోజులకు కల్టివేటర్‌తో అంతర కృషి చేస్తే కలుపును నివారించవచ్చు.

నీటి తడులు..తెగుళ్లు..

మొక్క జొన్న పూతకు ముందు. పూత దశలో, గింజ పాలుపోసుకునే దశలో బాగా నీరు పెట్టడం అవసరం. 30–40 రోజుల లోపు ఉన్న లేత పైరుకు అధిక నీరు హానికరం. విత్తిన తర్వాత పొలంలో నీరు నిలిస్తే విత్తనం మొలకెత్తదు. సాధారణంగా



గడివేముల వద్ద మొక్కజొన్న విత్తనాలు నాటుతున్న మహిళలు

తెగుళ్ల నివారణతోనే దిగుబడులు



ఖరీఫ్‌లో మొక్కజొన్న పైరును పురుగు ఆశించడం సహజం. సకాలంలో జాగ్రత్తలు తీసుకుంటే పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చు. సహజంగా అక్షింతల పురుగులు సిర్ఫిట్స్ వంటి పరాన్న జీవులు ఈ పురుగులను అదుపులో ఉంచుతాయి. రసం పీల్చు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే మోనోక్రోటోపాస్ ఎకరాకు 320 మిల్లీలీటర్లు లేదా డైమిటోయట్ కలిపి పిచికారీ చేయాలి. సరైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చు.

– రాజశేఖర్, ఏడీఏ, నంద్యాల

పంట కాలంలో 6–8 నీటి తడులు అవసరం. విత్తనాలు వేసినప్పుడు విత్తిన 15 రోజులకు తదితర దశల్లో నీటి తడులను తప్పకుండా ఇవ్వాలి. కాండం తొలుచు పురుగులు రెండు రకాలు. మచ్చల, చారల కాండం తొలిచే పురుగు ఎక్కువగా ఖరీఫ్ పైరును ఆశిస్తుంది. వీటితో దిగుబడి తగ్గుతుంది.

రసం పీల్చు పురుగులు...

30 రోజులు పైబడిన పైరుకు పేను బంక, నల్లి పురుగు ఆశించవచ్చు. పొడి వాతావరణంలో నీటి ఉధృతి ఎక్కువగా ఉంటుంది. లేత కాండం నుంచి రసాన్ని పీల్చడంతో ఆకులు పసుపు రంగుకు మారిపోతాయి. మొక్క సన్నగిల్లిపోతుంది. ఇవి విసర్జించే జిగురు పదార్థానికి చీమలు చేరడమే కాకుండా శిలీంద్రాలు ఏర్పడి మసి తెగులు ఆశించడం వల్ల కిరణజన్య సంయోగక్రియకు అంతరాయం ఏర్పడి దిగుబడి తగ్గుతుంది.

22న బాలబాలికల జిల్లా ఫుట్ బాల్ జట్ల ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీజీ క్రీడా మైదానంలో ఈనెల 22వ తేదీన జిల్లా ఫుట్‌బాల్ బాల బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు వినయ్‌సాగర్, సెక్రటరీ అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని వారు తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఫొటో, ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం తీసుకొని రావాలన్నారు. సబ్ జూనియర్ విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2012 జనవరి 1 నుంచి 2013 డిసెంబర్ 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎంపికైన జిల్లా జట్టును రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

ఎస్‌బీఐ ఉద్యోగులు రక్తదానం

నంద్యాల (వ్యవసాయం): స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ పిలుపు మేరకు కామ్రేడ్ తారకనాథ్ వర్ధంతి ,స్టేట్ బ్యాంకు 70 సంవత్సరాల వేడుకను పురస్కరించుకుని శుక్రవారం ఎస్‌బీఐ ఉద్యోగుల రక్తదానం చేశారు. పట్టణంలోని శ్రీనివాస సెంటర్లోని స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ ఆవరణలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. రక్తదాన శిబిరాన్ని స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సూర్య ప్రకాష్, హెచ్ఆర్ మేనేజర్ కేశవ గౌడ్, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి ప్రారంభించి మాట్లాడారు. దాదాపు 71 మందికి పైగా ఎస్‌బీఐ ఉద్యోగులు, కస్టమర్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఉస్మాన్, నాగేశ్వరావు, రాఘవ యాదవ్, మద్దిలేటి, డా సహదేవుడు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన

ఉయ్యాలవాడ: ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులురెడ్డి అన్నారు. శుక్రవారం ఉయ్యాలవాడ మండల వ్యవసాయాధికారిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు చేపట్టవలసిన మెలకువలు, సాగు చేసే పంటల గురించి వివరించారు. ప్రస్తుతం పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బంది రైతులకు తెలియజేయాలన్నారు. పొగాకు పంటకు మార్కెట్‌లో డిమాండ్ లేదు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేలా రైతులకు సూచించాలన్నారు. మండలంలో 1,195 మంది కౌలు రైతులకు కౌలు కార్డులు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 170 మందికి కౌలు కార్డులు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు సునీత, రాణెమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శ్రీనివాసులురెడ్డి

8గంటల పని దినాన్ని కొనసాగించాలి



నూనెపల్లె జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): 8 గంటల పనిదినాన్ని కొనసాగించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నూనెపల్లె జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు తోటమద్దులు, మహమ్మద్ గౌస్, రఘురామ్మూర్తి మాట్లాడుతూ కార్మికులను విస్మరిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పతనం ఖాయమని హెచ్చరించారు. మేడే స్ఫూర్తితో సాధించుకున్న 8గంటల పనివిధానాన్ని కొనసాగించాలన్నారు. మోడీ ప్రభుత్వం పెట్టుబడి దారులకు, కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తుందన్నారు. కార్మికులపై కక్ష కట్టి పనిగంటలను 12 గంటల వరకు పెంచడం సరికాదన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా ప్రజా సంఘాల నాయకులు చౌడప్ప, ఆనంద్, రాంబాబు, వెంకటలింగం, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సీఓపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని మెప్మా కార్యాలయంలో సీఆర్పీగా పని చేస్తున్న భవానీపై దాడి చేసిన సీఓ లక్ష్మీకుమారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, మెప్మా సీఎంఎం శోభాకు ఏపీ మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సుజాత, హైమావతి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలోని 15వ వార్డులో విధులు నిర్వహిస్తున్న రహమత్‌బీని రూ.30 వేలు ఇవ్వాలని, ఇవ్వకుంటే ఆర్పీగా నిన్ను తొలగిస్తానని సీఓ బెదిరించిందన్నారు. ఈ విషయాన్ని 28వ వార్డులో విధులు నిర్వహిస్తున్న సీఆర్పీ భవానీ అందరికీ తెలియజేసిందని ఆఫీసు వద్దకు రాగానే ఆమె మెడకు చున్నీ చుట్టి అసభ్య పదజాలంలో దూషిస్తూ చెంపమీద కొట్టిందన్నారు. దురుసుగా ప్రవర్తించిన సీఓపై తక్షణమే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఈనెల 23వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

దైనందిన జీవితంలో యోగా భాగం కావాలి

నంద్యాల (వ్యవసాయం): దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని డాక్టర్ బాబాను, న్యాయవాది రామచంద్రరావు అన్నారు. నంద్యాల సబ్ జైలులో అంతర్జాతీయ యోగాడే ను పురస్కరించుకొని శుక్రవారం ఖైదీలతో యోగ ఆసనాలు వేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడుతూ ఖైదీలు రోజూ ధ్యానం, యోగ చేస్తూ మానసిక ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత మేడా మురళీధర్, నాయకులు సల్లా రమేష్, రాజహుస్సేన్, లింగా రెడ్డి, యోగా మాస్టర్ రమేష్, బద్రి శెట్టి రవికుమార్, ఇమ్మడి వెంకట రామకృష్ణుడు, దయాకర్, ఈపూరి మోహన్ పృథ్వీ రాజ్, సబ్ జైలు సూపరింటెండెంట్ గురు ప్రసాద్ రెడ్డి, డిప్యూటీ జైలర్ షేక్ బాబు, అడిషనల్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేద్దాం

ఆళ్లగడ్డ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ప్రైవేటు పాఠశాలల డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా అన్నారు. అంతర్జాతీయ యోగా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక విశ్వశాంతి స్కూల్‌లో శుక్రవారం యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం వలన మానసిక, శారీరక దృఢత్వం అలవడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని అన్నీ గ్రామాల సచివాలయాల్లో శనివారం ఉదయం 7.00 గంటలకు అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సచివాలయాల సిబ్బంది ప్రతి ఒక్కరు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

శాంతినికేతన్ స్కూల్‌లో యోగా

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని క్రాంతినగర్‌లో ఉన్న శాంతినికేతన్ పాఠశాల ఆవరణలో శుక్రవారం యోగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రామకృష్ణా విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్, నంద్యాల బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు హాజరై మాట్లాడారు. భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమం యోగా అని కొనియాడారు. కార్యక్రమంలో నిమ్మకాయల సుధాకర్, తూము శివారెడ్డి, లక్ష్మారెడ్డి, రమణ, బాలముని, తదితరులు పాల్గొన్నారు.



సబ్ జైల్లో యోగా చేస్తున్న దృశ్యం

రుద్రవరం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి సచివాలయ ఉద్యోగులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆమె వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనివారం 16 గ్రామ సచివాలయాల పరిధిలో నిర్ణీత పాయింట్లలో అంతర్జాతీయ యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు కమాల్‌సాహెబ్, సుబ్రహ్మణ్యం, ఎంఈఓ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగాకు ప్రత్యేక అధికారులు

శిరివెళ్ల: మండలంలో శనివారం నిర్వహించే అంతర్జాతీయ యోగాడేకు మండలంలోని గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు. శుక్రవారం యోగాపై పంచాయతీ, సచివాలయాల కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు యోగా కార్యక్రమాలుంటాయన్నారు.

సంక్షిప్తం

ఇద్దరిపై దాడి కేసు నమోదు

రుద్రవరం: దారి విషయంలో ఓ మహిళపై దాడి చేసిన ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మందలూరు గ్రామానికి చెందిన కళావతమ్మ అనే మహిళ గ్రామ సమీపంలోని తమ పొలానికి వెళ్తుండగా మీకు ఇటువైపు దారి లేదని వెళ్లనివ్వమని అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, జస్వంత్‌రెడ్డి అడ్డగించారు.అయితే, పూర్వం నుంచి ఇదే దారిలో వెళ్తున్నామని ఇప్పుడు కూడా వెళ్తానని ఆ దారిలో వెళ్తుండగా చెప్పిన వినవా అంటు దాడి చేసినట్లు బాధితురాలు ఫిర్యాదు ఇవ్వడంతో ఆ ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు నాణ్యత తనిఖీ

రుద్రవరం: మండల పరిధిలోని చందలూరు నుంచి చిలుకలూరు, ఎర్రగుడిదిన్నె ,పేరూరు మీదుగా శిరివెళ్ల వరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తారు రోడ్డు వేశారు. ఈ రోడ్డు నాణ్యతను శుక్రవారం అధికారులు తనిఖీ చేశారు.

నేడు చాగలమర్రిలో విద్యుత్ అంతరాయం

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు, చాగలమర్రి విద్యుత్ సబ్-స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు వివిధ మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు ఆ శాక ఏఈ రమణయ్య తెలిపారు. ఈ నేపథ్యంలో 5 గంటల పాటు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

నంద్యాల: ఆర్వో ప్లాంట్‌ను సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో రూ. 7 లక్షలతో నిర్మించిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను కలెక్టర్ శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగులు, వివిధపనులమీద కలెక్టరేట్‌కు వచ్చే వారి సౌకర్యార్థం ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రాము నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, భూగర్భ జల శాఖ డీడీ రఘురాం, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలను సద్వినియోగం చేసుకోండి



రెవెన్యూడేలో మాట్లాడుతున్న చాగలమర్రి తహసీల్దార్ ఆర్ విజయ్‌కుమార్



దొర్నిపాడులో విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సన్మానిస్తున్న తహసీల్దారు

ఉయ్యాలవాడ: రెవెన్యూ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సువర్ణాదేవి రైతులకు సూచించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలువురు రైతులను శాలువ కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు, మండల సర్వేయర్ విజయలక్ష్మి, నాయకులు కూడాల నారాయణరెడ్డి, మారంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పేరెడ్డి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

- **శిరివెళ్ల:** రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రజా సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ జయశ్రీ మాట్లాడుతూ ప్రతి ఏడాది జూన్ 20వ తేదీన రెవెన్యూ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. భూ సమస్యలు, ఆస్తి తగాదాలు పరిష్కారానికి తమ శాఖ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అశోక్ కుమార్, ఆర్ఐ రాఘవేంద్రకుమార్, మాజీ జెడ్పీటీసీ యామా గుర్రప్ప, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.
- **దొర్నిపాడు:** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవం సందర్భంగా తహసీల్దారు సుభద్ర, రిటైర్డ్ డీటీ సువర్ణ, వీఆర్వోలు సాయిబాబరెడ్డి, మద్దిలేటిస్వామి, శివరామయ్య, రైతులు, సిబ్బందిని ఘనంగా సన్మానించి రెవెన్యూ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీటీ మాధవ్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.
- **చాగలమర్రి:** ప్రభుత్వ శాఖలలో రెవెన్యూ శాఖ కీలకమైనదని చాగలమర్రి ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్.విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 'రెవెన్యూ డే' నిర్వహించి వీఆర్‌ఓలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకుడు సల్లా నాగరాజు, ఆర్ఐ సత్తార్, వీఆర్‌ఓలు వెంకట్రామిరెడ్డి, ఇమాంబాషా, శారద, ప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు, పరమేశ్వర సాయినాథ్ పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ డే

ఆళ్లగడ్డ: రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రత్నకుమారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన వేడుకల్లో సుదీర్ఘకాలం సేవలందించి రిటైర్డ్ అయిన సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూశాఖ చరిత్ర, విశిష్టతను వివరించారు. ఎప్పటికప్పుడు ప్రజలకు మరిన్ని మంచి సేవలను అందించేలా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

వెండి నాగ పడగ బహూకరణ

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ రామతీర్థ పుట్లాలమ్మ క్షేత్రంలో అమ్మవారికి భక్తుడు వెండి నాగ పడగను కానుకగా అందించారు. రుద్రవరం గ్రామానికి చెందిన భక్తుడు సురేష్ మొక్కుబడిలో భాగంగా 520 గ్రాముల వెండి నాగ పడగను ఆలయ అధికారులకు శుక్రవారం అందజేశారు. ఆలయ అర్చకులు నాగ పడగను అమ్మవారికి అలంకరించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు



వెండి నాగ పడగ అందజేస్తున్న భక్తులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోస్పాడు: ఆత్మహత్యయత్నం చేసుకున్న కృష్ణాపురం గ్రామానికి చెందిన యేర్వ గణేష్‌రెడ్డి(30) కోలుకోలేక శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన యేర్వ గణేష్‌రెడ్డికి, అదే మండలం బీవీనగర్‌కు చెందిన సుమిత్రతో రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. అయితే, కొంతకాలం నుంచి ఇరువురి మధ్య మనస్పర్థలు తలెత్తాయి. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన గణేష్‌రెడ్డి ఈనెల 17న గ్రామ సమీపంలోని పొలాల వద్ద గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. స్థానికులు గమనించి హుటాహుటిన నంద్యాల పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడే చికిత్సపొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి రామకృష్ణారెడ్డి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మద్దిలేటి తెలిపారు.

పొగాకు రైతులను ఆదుకోవాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు బొజ్జదశరథరామిరెడ్డి తదితరులు

నంద్యాల(అర్బన్): సాగు చేసిన పొగాకు కొనుగోలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకోవాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి కోరారు. పలు కంపెనీల ఒప్పందాల మేరకే జిల్లా రైతులు దాదాపుగా వేలాది ఎకరాల్లో పొగాకు పంటలు సాగు చేశారన్నారు. ఇప్పుడు అనుమతులు లేవంటూ కేఎఫ్‌సీ పొగాకు కొనుగోలుకు కంపెనీలు నిరాకరిస్తున్నాయన్నారు. మీరు స్పందించి కొనుగోలు జరిగేలా చూడాలని శుక్రవారం కలెక్టర్ రాజకుమారిని ఆమె కార్యాలయంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు ఏర్వ రామచంద్రారెడ్డి, పొగాకు ఉత్పత్తిదారుల సంఘం నాయకులు అమరేంద్ర రెడ్డి, మధుసూదన్ రెడ్డి చిన్న గోకారి వెంకటసుబ్బయ్య, మధు, గోపాల్, కృష్ణ, మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు వివిధ మండలాల రైతులు పాల్గొన్నారు